## రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య ఆత్మహత్యాయత్నం?

- **నా చావుకు కారణం రాజ్‌తరుణ్, మాల్వీనే అని లాయర్‌కు మెసేజ్**
- **లాయర్ అలర్ట్‌తో పోలీసుల రంగప్రవేశం**
- **లావణ్యకు నార్సింగి పోలీసుల కౌన్సెలింగ్**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ)/మణికొండ : నటుడు రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తన లాయర్‌తో చాటింగ్ చేసేముందు ఆత్మహత్యకు యత్నిస్తున్నట్టు తెలుపడంతో.. ఆయన హుటాహుటిన డయల్ 112కు కాల్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లావణ్యకు రక్షణ కల్పించాలని, రాజ్‌తరుణ్, అతని తల్లిదండ్రులు, ప్రియురాలు మాల్వీ మల్హోత్రపై చర్యలు తీసుకోవాలని శనివారం లావణ్య న్యాయవాది డీజీపీ జితేందర్‌ను కలిశారు. కేసును త్వరగా పరిష్కరించాలని డీజీపీ ఉన్నతాధికారులకు ఆదేశించారు. లావణ్య ఆత్మహత్యాయత్నం చేస్తూ.. 'ఈ లోకంలో నా పయనం పూర్తి చేశా. అందుకే వెళ్లిపోతున్నా. నేను ఏంటో తెలిసిన మనుషులే నన్ను తప్పుబట్టారు. రాజ్‌తరుణ్ చేతిలో మోసపోయా. మైండ్ గేమింగ్, గాసిప్స్‌తో విసిగిపోయా. మస్తాన్ కేసులో నేను కీలుబొమ్మనయ్యా. ప్రతిదీ పథకం ప్రకారం జరిగింది. నా చావుకు కారణం రాజ్‌తరుణ్, అతని తల్లిదండ్రులు, మాల్వీ మల్హోత్రా' అంటూ తన లాయర్‌కి మెసేజ్ చేసింది. రాజ్‌తరుణ్ తనని పెండ్లి చేసుకొని, మరొకరితో డేటింగ్‌లో ఉన్నాడని, తనకు న్యాయం చేయాలని లావణ్య ఇటీవల పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## ఐదు యూట్యూబ్ చానళ్లను రద్దు చేయించాం

**'మా' అసోసియేషన్ ప్రకటన**

హైదరాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ): సినీ తారలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వారి కుటుంబ, వ్యక్తిగత విషయాలపై దుష్ప్రచారం చేస్తున్న ఐదు యూట్యూబ్ చానళ్లను రద్దు చేయించినట్టు మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. జస్ట్ వాచ్ బీబీసీ, ట్రోల్స్‌రాజా, బచినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌వైజెడ్ ఎడిట్స్ 007 చానళ్లు ఈ టర్మినేట్ జాబితాలో ఉన్నాయి. ఇది ఆరంభం మాత్రమేనని, ముున్ముందు మరిన్ని చర్యలుంటాయని 'మా' పేర్కొంది. నటీనటుల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే చానళ్లు పద్ధతి మార్చుకోవాలని, 48 గంటల్లో అసభ్యకర వీడియోలను తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు క్రితం సోషల్‌మీడియాలో హెచ్చరించారు. సదరు చానళ్ల శైలిలో మార్పు రాకపోవడంతో 'మా' అసోసియేషన్ యూట్యూబ్ సంస్థ ఫిర్యాదు చేయగా, వారి విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నది.

## చొప్పదండి యువకుడి హత్యపై రీ ఎంక్వైరీ

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన మందా విను అనే యువకుడు జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయిన కేసును కరీంనగర్ ఇంటెలిజెన్స్ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలో అతని స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని, స్థానిక పోలీసులు తమకు న్యాయం చేయడం లేదని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులు గత మంగళవారం డీజీపీ ఆఫీసుకు వచ్చి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై 'న్యాయం కోసం డీజీపీ ఆఫీసుకు' శీర్షికన నమస్తే తెలంగాణ కథనం ప్రచురించింది. దీంతో నాటి డీజీపీ రవిగుప్తా ఆ కేసును తక్షణమే విచారించాలని మల్టీ జోన్-1 ఐజీకి ఆదేశాలిచ్చారు. ఆయన సూచనల మేరకు కరీంనగర్ సీపీ నేతృత్వంలో ఇంటెలిజెన్స్ పోలీసులు నిందితుల వివరాలతో మరోసారి విచారణ చేపట్టారు. నిందితుల్లోని కొందరు కాంగ్రెస్ నాయకుల అండతో తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు విలపిస్తున్నారు. ఫోన్ మెమొరీ కార్డులు మాయం చేసి సమాచారాన్నంతా డిలీట్ చేసిన నిందితులు.. విను రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి సివిల్ పోలీసులు వంతపాడుతూ కేసును కొట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని, డీజీపీ తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# కేయూలో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

### విద్యార్థినులకు తప్పిన ప్రమాదం

- **పోతన గర్ల్స్ హాస్టల్‌లో ఘటన**

హనుమకొండ చౌరస్తా, జూలై 13 : వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పోతన గర్ల్స్ హాస్టల్ స్లాబ్ పెచ్చులు భారీగా కుప్పకూలి పడ్డాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిన సమయంలో ఆ గదిలో విద్యార్థినులు లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ విద్యార్థినులు శనివారం పోతన హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. పెచ్చులూడిన సమయానికి తాము లేకపోవడం ప్రాణాలతో బయటపడ్డామని లేకుంటే ఘోరం జరిగేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకదశలో మల్లారెడ్డిని బంధించేందుకు యత్నించారు. కేయూలో వర్షాకాలంలో తమ బాధలు పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితమే సీలింగ్ ఫ్యాన్ కిందపడటంతో ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. తమ ప్రాణాలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు.



స్లాబ్ శిథిలాలను చూపుతున్న విద్యార్థినులు

### పెద్ద ప్రమాదం తప్పింది



"మెస్‌కు వెళ్లి వస్తుంటే పాము, కుక్కలు కనిపించాయి. వాటి గురించే మాట్లాడుకుంటూ గదికి వచ్చాం. అదే భయంతో ఉండగా పక్కనున్న టేబుల్‌పై మా స్నేహితులు కూర్చున్నారు. నేను పక్క బెడ్‌పై పడుకుని ఫోన్ చూస్తుంటే పెద్ద బండ పడటంతో వెంటనే లేచి ఫ్యాన్ ఆఫ్ చేశా. అప్పుడే ఒకటి తర్వాత పెద్ద పెచ్చులూడి బెడ్‌పై పడ్డాయి. ఆ బెడ్‌పై పడుకునే అమ్మాయి ఉదయమే వాళ్ల ఇంటికి వెళ్లింది. లేకుంటే ఆమె ప్రాణానికే ప్రమాదం జరిగేది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు.

–అనూష, విద్యార్థిని

### హాస్టల్‌ను షిఫ్ట్‌చేసే ఆలోచనలో ఉన్నాం..

"పోతన హాస్టల్ నుంచి విద్యార్థులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో ఉండగానే ప్రమాదవశాత్తు పెచ్చులూడిపడ్డాయి. ప్రత్యామ్నాయంగా విద్యార్థులను మరో హాస్టల్‌కు తరలిస్తాం. కొన్ని సంవత్సరాలుగా హాస్టల్ విద్యార్థుల సంఖ్య పెరిగింది. గతంలో పద్మాక్షి హాస్టల్ ఒక్కటే ఉండేది. బాయ్స్ హాస్టల్ అమ్మాయిలకు కేటాయించాం. పది రోజుల క్రితం ఫ్యాన్ కిందపడి రెక్కతగలడంతో విద్యార్థినికి గాయమైంది. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం.

– ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి, రిజిస్ట్రార్

### • ఖానాపూర్‌లో స్వర్ణకారుల ఆందోళన



తాము చేసిన బంగారు ఆభరణాలు నకిలీ అని ఖానాపూర్ ముత్తూట్ ఫైనాన్స్ నిర్వాహకులు తమ వినియోగదారులకు సూచించారని ఆరోపిస్తూ ఖానాపూర్‌లోని స్వర్ణకారులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం బంగారం కుదువ పెట్టి లోన్ తీసుకునేందుకు స్థానిక ముత్తూట్ ఫైనాన్స్ వెళ్లగా నకిలీ బంగారం అని వారు నిరాకరించారంటూ స్వర్ణకారులు నిరసన చేపట్టారు. –ఖానాపూర్ టౌన్

### • గురుకులం తీరుపై తల్లిదండ్రుల ఆందోళన



ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరంలోని పూలే బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేవని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు రెబ్బవరం ప్రధాన రహదారిపై శనివారం బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు. – వైరారూరల్



### • మా పిల్లలతో టాయిలెట్లు కడిగిస్తారా?

మెదక్ జిల్లా రామాయంపేట శివారులోని గురుకుల హాస్టల్‌లో మూడురోజుల క్రితం ఎలుకలు కరవడంతో విద్యార్థినులు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం గురుకుల హాస్టల్ వద్దకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. పిల్లలను ఎలుకలు కరిచినా తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ పిల్లలతో టాయిలెట్లు కడిగిస్తారా? ఇంత అధ్వానంగా బాత్‌రూమ్‌లు ఉంటే తామెలా పిల్లలను చదివించాలని హాస్టల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. – రామాయంపేట

## కొనసాగుతున్న 'గ్రూప్-4' వెరిఫికేషన్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతున్నది. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో టీజీపీఎస్సీతో పాటు తెలుగు యూనివర్సిటీలో కూడా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆగస్టు 21 వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందని వెబ్‌నోట్‌లో పేర్కొన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన దివ్యాంగ అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెరిఫికేషన్ త ర్వాత వెల్లడించే తుది జాబితా కంటే ముందుగానే అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## 'అర్హులకే పదోన్నతులు కల్పించాలి'

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ): యూజీసీ, గురుకుల సర్వీస్ రూల్స్, నిబంధనల ప్రకారం అన్నివిధాలా అర్హులైన డిగ్రీ లెక్చరర్లకే ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు కల్పించాలని గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శారద, ప్రధాన కార్యదర్శి సత్య శ్రీదేవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు, పీహెచ్‌డీ అర్హత ఉండాలని, డీఎల్‌గా ఐదేండ్ల బోధనానుభవంతో పాటు డి పార్ట్‌మెంటల్ పరీక్షలు పాసై ఉన్నవారే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందడానికి అర్హులని పేర్కొన్నారు.

## నేటి నుంచి సమగ్ర కులగణన సాధన యాత్ర

**విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ పిలుపు**

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో సమగ్ర కులగణన సాధన యాత్ర చేపట్టినట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు 18 రోజులపాటు 10 జిల్లాల్లో యాత్ర నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. యాత్రలో పార్టీలకతీతంగా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.